ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
సోమవారం 19 ఫిబ్రవరి 2024



మేడారంలో రోడ్లపైనే ప్లాస్టిక్ చెత్త

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఏది?

ప్రచారమే తప్ప ఆచరణలో విఫలం

- మేడారం జాతరలో విచ్చలవిడిగా వాడకం
- నాలుగు రోజుల్లోనే 2,500 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి
- వీటిలో 1,250 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే..
- గాజు బాటిళ్లు, జంతు వ్యర్థాలతో వాతావరణ కాలుష్యం
- భవిష్యత్తు తరాలకు ప్రమాదమంటున్న నిపుణులు

వరంగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫ్రీ ప్లాస్టిక్ జాతర.. ఇది ప్రతీ మేడారం మహజాతర ముందు ఓ ఊత పదంగా మారింది. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రచార్భాటం తప్ప.. ఆచరణలో మాత్రం ఎవరూ శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులతో మేడారంలోని పచ్చని అడవుల్లో టన్నుల కొద్ది ప్లాస్టిక్ పోగవుతోంది. ప్లాస్టిక్ ఫ్రీ జాతర.. హరిత మేడారం.. ఇలా ఎన్నో పేర్లతో మేడారానికి ప్లాస్టిక్ తీసురావొద్దనే ప్రచార్భాటం ప్రతీసారి జరుగుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవటం లేదు. ప్లాస్టిక్‌కుతోడు లక్షలాది జంతువుల వ్యర్థాలు, గాజు సీసాలతో వాతావరణ కాలుష్యం మరింత దెబ్బతింటోంది. 'ఫ్రీ ప్లాస్టిక్ మేడారం' నినాదమిచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నేతలే విచ్చల విడిగా జాతరలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పెడుతూ ఏం సందేశం ఇస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్లాస్టిక్ ఫుల్ మేడారం

మేడారం జాతరకు వచ్చే భక్తుడి చేతిలో ప్లాస్టిక్ దర్శనమిస్తుంటుంది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్, ప్లాస్టిక్ కూల్‌డ్రింక్స్ బాటిల్స్, చివరకు తల్లులకు సమర్పించే బెల్లం బుట్టకు కూడా ప్లాస్టిక్ కవర్ దర్శనమిస్తుంది. ప్లాస్టిక్ వినియోగం లేకుండా ఏ ఒక్క భక్తుడు కనిపించడంటే అతియోశక్తి కాదు. ఇక లక్షలాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం అడవిప్రాంతం మొత్తం ప్లాస్టిక్‌తో నిండిపోతుంది. ఓవైపు ప్లాస్టిక్ నిషేధానికి ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమమే నడుస్తోంది. భూమిలో కూరుకుపోయిన ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోయేందుకు వందేళ్లకు పైగా సమయం పట్టవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మహజాతరతో మేడారం పరిసరాలు ప్లాస్టిక్‌తో భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. భూకంపాలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్లాస్టిక్‌ను నియంత్రించాలని సూచిస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే పూడ్చివేత

మహజాతర సందర్భంగా వేల టన్నుల్లో పోగవుతున్న చెత్తను స్థానింగా ఉన్న అడవుల్లోనే పూడ్చివేయటం లేదా కాల్చి వేయడం చేస్తున్నారు. మేడారానికి చుట్టు పక్కల ఉన్న నార్లాపూర్, కొంగలగుట్ట, గుడ్డేలుగు గుట్ట, రెడ్డిగూడెం, ఊరట్టం తదితర ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో భారీ గుంతలు తవ్వుతుంటారు. ప్రతీ మహజాతరలో ఉత్పత్తి అయ్యే కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి వాటి వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, బియ్యం, బెల్లం, గాజులు తదితర వాటిని ఇందులో వేసి పూడ్చి పెడుతుంటారు. 2022 మహజాతరలో సుమారు 3లక్షల మేకలు, గొర్రెలు, కోళ్లు తెగినట్లుగా అంచనా. వీటి వ్యర్థాలన్నీ కూడా భూమిలో పూడ్చేశారు. ఇక ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లతో పాటు ఇతర ప్లాస్టిక్ సంబంధించిన చెత్తను కాల్చి వేస్తుంటారు. దీంతో జంతువుల వ్యర్థాలను పూడ్చి వేసిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు కాలుష్యం కాటుకు గురవుతున్నాయి.



ప్లాస్టిక్ కాలకేయ(ఫైల్)



మేడారంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు

గాజు సీసాలతో ప్రమాదం

మహజాతరలో పోగవుతున్న ప్లాస్టిక్‌తో భారీ ముప్పు వాటిల్లుతుందనే భయాందోళనలు ఉన్నాయి. నిపుణుల అంచనా ప్రకారం పాలిథిన్ కవర్ నుంచి పీవీసీ పైపుల వరకు గత జాతరలో 1,021 టన్నుల ప్లాస్టిక్ చెత్త ఇక్కడ చేరినట్లుగా గుర్తించారు. ఇందులో సన్న ప్లాస్టిక్ కవర్ల వాటా ఏకంగా 200టన్నులుగా నమోదైనట్లుగా సమాచారం. సుమారు 2వేల మందికి పైగా పారిశుద్య కార్మికులు శ్రమించినప్పటికీ జాతర ప్రాంతంలోని పొలాల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డంపింగ్ యార్డుల్లో నిల్వచేసిన చెత్త నుంచి ప్లాస్టిక్ కవర్లు గాలిలో కొట్టుకపోయి అడవుల్లో పరుచుకుంటున్నాయి. ఇలా అడవుల్లో, పొలాల్లో కనిపించే ప్లాస్టిక్‌ను తినటం వల్ల పశువులు, ఇతర జంతువులు అనారోగ్యం పాలవుతున్నట్లుగా అధికారులు గుర్తిస్తున్నారు. డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన ప్లాస్టిక్‌ను మండించటం వల్ల ఏర్పడే పొగతో అడవుల్లో ఉండే జంతువులు, పక్షులపై ప్రభావం పడుతున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు మేడారం మహజాతరలో మద్యం ఏరులైపారుతోంది. జాతర ముగిసిన తరువాత లక్షల్లో గాజు మద్యం బాటిళ్లు దర్శనమిస్తాయి. మహజాతరలో పోగవుతున్న వ్యర్థాల్లో సుమారు 100టన్నులకుపైగా బాటిళ్ల వ్యర్థాలే ఉన్నట్లుగా అధికారులు లెక్కలు వేస్తున్నారు. వీటిలో 50శాతం వరకు బాటిళ్ల రీసైక్లింగ్ అవుతుండగా, మిగతా 50శాతానికిపైగా బాటిళ్లు జాతర అవరణలో పగిలిపోతున్నాయి. ఇలా జాతర జరిగే ప్రాంతాల్లో గాజు పెంకులు ఉండటం వలన పొలాల్లోకి వెళ్లే రైతులకు, కూలీలకు, పశువులకు గాయాలు చేస్తున్నాయి.

ప్రచారమేనా.. ఆచరణేది..?

ఫ్రీ ప్లాస్టిక్ మేడారం జాతరగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీ జాతర ముందు ఇలాగే ప్రచారం చేయడం.. జాతర సమయంలో ప్లాస్టిక్ రాకుండా ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా చేతులు ఎత్తివేయటం అనవాయితీగా వస్తోందనే విమర్శలున్నాయి. ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్ బ్యాగులు, జనుప సంచులను వినియోగించేలా భక్తులకు అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే జాతరలో ప్లాస్టిక్ విక్రయించే షాపులపై దాడులు నిర్వహించకుండా ఎలా ప్లాస్టిక్‌ను ఆరికడతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చిత్తశుద్ధితో ప్లాస్టిక్‌ను ఆరికట్టకుంటే మేడారంలోని భావితరాలకు భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాతరంతా చెత్తనే..

మేడారం మహజాతర జరిగే నాలుగు రోజుల్లోనే 2వేల టన్నులకుపైగా చెత్త పోగవుతుంది. 2022 మహజాతరలో చెత్త భారీగా పోగైంది. జాతర జరిగిన ఆ నాలుగు రోజుల్లో 2,600టన్నుల చెత్తను గుర్తించగా, ఇందులో 1,021టన్నులు ప్లాస్టిక్, 420టన్నులకు పైగా జంతు వ్యర్థాలు పోగైనట్లుగా అధికారులు గుర్తించారు. మిగతా చెత్తలో భూమిలో తేలికగా కలిసిపోయే బియ్యం, బెల్లం, కొబ్బరి, ఆహారవ్యర్థాలు తదితరాలు ఉన్నాయి. 52శాతం భూమిలో కలిసి పోయే చెత్త ఉండగా, ఇక భూమిలో తేలికగా కలిసిపోని ప్లాస్టిక్ 48శాతం వరకు ఉంది. వందల ఏళ్ల వరకు కూడా భూమిలో కలిసిపోలేని ప్లాస్టిక్ ప్రతీ జాతర సందర్భంగా మేడారం పరిసరాల్లో పోగవుతోంది. పచ్చని అడవుల్లో భూమిలో కలిసిపోయిన ప్లాస్టిక్‌తో భవిష్యత్తులో భారీ నష్టాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది.





వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



భక్తజన సంద్రంగా మేడారం

- తల్లుల దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- వందల వాహనాలతో నిండిపోయిన పార్కింగ్‌లు

మేడారం, ఫిబ్రవరి 18: వనదేవతలు సమ్మక్క,సారలమ్మలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. మహజాతరకు ముందే తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలువు కావడంతోపాటు మహజాతరకు మరో రెండు రోజుల సమయం ఉండడంతో తెలంగాణ నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు మేడారం తరలివచ్చారు. దీంతో గద్దెల ప్రాంగణం అమ్మవార్ల నామస్మరణతో మార్మోగింది. రద్దీ అధికంగా ఉండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ, పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్రమ పద్ధతిలో క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మవార్ల గద్దెలను సులభంగా దర్శించుకొని వెళ్లేలా పోలీసు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆదివారం 10 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



వనదేవతలను దర్శించుకునేందుకు వెళ్తున్న శివసత్తి

కిటకిటలాడిన పార్కింగ్ స్థలాలు

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన లక్షల మంది భక్తుల వేల సంఖ్యలో వాహనాలను పోలీసు అధికారులు పార్కింగ్ స్థలాలకు తరలించారు. పస్రా, నార్లాపూర్,

మిగతా 7వ పేజీలో..

నేడు మేడారంలో మంత్రుల పర్యటన

మేడారంలో రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం పర్యటించనున్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించనున్నారు. ఆయా శాఖల అధికారులతో సమావేశమై జాతర నిర్వహణపై సమీక్షించనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం పరిశీలించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

క్రీడ, సాంస్కృతిక రంగాల్లోనూ ఆసక్తి చూపాలి

- చిత్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా



వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సందీప్‌రెడ్డి

గిర్మాజీపేట,ఫిబ్రవరి 18: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ఆసక్తిని కలిగి ఉండాలని అర్జున్ రెడ్డి, అనిమల్ చిత్రాల దర్శకుడు, ప్లాటినం జూబ్లీ హైస్కూల్ పూర్వ విద్యార్థి వంగా సందీప్ రెడ్డి విద్యార్థులను సూచిం చారు. వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో ఆదివారం పాఠశాల వార్షికోత్సవం రీజనల్ రిథిమ్స్ విద్యార్థుల ఆట, పాటలతో కన్నుల పండువగా జరిగింది. ముఖ్యఅతిథి సందీప్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు,సాంస్కృతిక రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే జీవిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని విద్యలో రాణించాలన్నారు. ప్లాటినం జూబ్లీ హై స్కూల్ విద్యార్థులు దేశ,విదేశాల్లో అన్ని రంగాల్లో ప్రముఖస్థానాల్లో ఉన్నారని ఇందుకు నిదర్శనం తానేనని సందీప్‌రెడ్డి అన్నారు. ఆగాఖాన్ విద్యా సంస్థల డైరెక్టర్ నూరొద్దీన్ దమాని, ఆగాఖాన్ హా స్టల్ హెడ్ అమీన్ మందానిలు మాట్లాడుతూ నగ రంలో పాత కూరగాయల మార్కెట్ ప్రారంభమైన ప్లాటినం జూబ్లీ ప్రస్తుతం అబ్బనికుంటలో విశాలమైన విద్యాప్రాంగణంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రిన్సిపాల్ జగదీష్, హైదరాబాద్ డైమండ్ జూబ్లీ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, అలియా పర్వీన్, ముఖిసాహేబ్, హుస్సేన్ లాలాని, కమాడియా సాహెబ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ అవహేళన చేసింది..

- ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది..
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

సుబేదారి, ఫిబ్రవరి 18: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను అవహేళన చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల, కళాకారుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను గౌరవించి వారికి న్యాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను అవహేళన చేసి అవమాన పరిచిందన్నారు. ఎప్పుడైతే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారో, ఉద్యమ లక్ష్యాలను పట్టించుకోలేదో ప్రజలకు దూరమై ఓటమి పాలయ్యారన్నారు. కాంగ్రెస్ విజయం ఉద్యమకారుల, నిరుద్యోగ యువకుల విజయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల భద్రత కోసం ఇంటి స్థలాల కేటాయింపు, కేసుల ఎత్తివేత మొదలైన భద్రత కోసం వాగ్దానం చేసిందని, వాటిని తప్పనిసరిగా నెరవేరుస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఈ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తెలంగాణ ఆకాంక్షల వేదిక అధ్యక్షుడు సూరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రియాజ్, ఉద్యమ నేతలు గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పృథ్వీరాజ్, కాంగ్రెస్ నాయకురాలు కూచన రవళి, కుమార్, అజయ్, శోభ పాల్గొన్నారు. కాగా, బుల్లెట్ వెంకన్న, దారా దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇద్దరు ఏసీపీల బదిలీ




హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 18 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఆర్.భీంశర్మ (ఎస్‌బీ, సెక్యూరిటీ వింగ్) వరంగల్ నుంచి రాజన్న సిరిసిల్లకు బదిలీ అయ్యాడు. కె.పార్థసారథి కల్వకుర్తి నుంచి ఎస్‌బీ, సెక్యూరిటీ వింగ్ వరంగల్‌కు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

నేటి బల్దియా ప్రజావాణి రద్దు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 18: వరంగల్ మహానగర పాలక సంస్థ సోమవారం నిర్వహించే ప్రజవాణి కార్యక్రమం రద్దు అయింది. మేడారం జాతర క్రమంలో రద్దు చేసినట్లు ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఫిర్యాదులు అందచేయడానికి ప్రధాన కార్యాలయానికి రావద్దని కోరారు.

జీఐఎస్‌తో మ్యాపింగ్

- గ్రేటర్ వరంగల్ భౌగోళిక సమాచార సేకరణ
- కేంద్రం ఆదేశంతో బల్దియా కసరత్తు
- నేటితో ముగియనున్న టెండర్ల దాఖలు
- మ్యాపింగ్ చేస్తే కార్పొరేషన్ వద్దే సమస్త సమాచారం
- అన్ని వివరాలు డిజిటల్ రూపంలో..



మట్టెవాడ(వరంగల్), ఫిబ్రవరి 18: వరంగల్ మహానగరానికి సంబంధించిన మ్యాపింగ్‌తో జీఐఎస్(జియోగ్రఫి ఇన్ఫర్మేషన్ సిస్టం) రూపొందించేందుకు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిద్ధమవుతోంది. ప్రతీ ఒక్క విషయం బల్దియా వద్ద ఉండేలా అన్ని నగరాలకు సంబంధించిన మ్యాపింగ్ చేయాలని కేంద్రం గతేడాది ఆదేశించడంతో గ్రేటర్ కార్పొరేషన్ ఈ ప్రక్రియను ప్రారంభించింది. ఈమేరకు ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్ నోటిఫికేషన్‌ను ఇటీవల విడుదల చేసింది. ఇందుకు సంబంధించి డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) అమృత్ అండ్ జీవోఐ మార్గదర్శకాల ప్రకారం ఈ సర్వేను చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కార్పొరేషన్ సర్వే కోసం జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. నేటితో (ఫిబ్రవరి 19) టెండర్ బిడ్ దాఖలుకు గడువు ముగియనుంది.

సమస్తం బల్దియా చేతిలోకి..

జీఐఎస్ డీజీపీఎస్ సాంకేతికతతో వరంగల్ మహానగరానికి సంబంధించిన మ్యాపింగ్‌లు, బేస్ మ్యాప్‌లు, హద్దులు, వార్డు హద్దులు, సిటీ బేస్ మ్యాప్‌లు, శాటిలైట్ మ్యాప్‌లు, ట్యాక్స్ రేట్ జోన్స్, వార్డుల వారీగా స్లమ్ ఏరియాలను గుర్తించనున్నారు. ఇంటింటి సర్వే, రోడ్లు, డ్రెయినేజీ నెట్ వర్క్, ఆస్తి పన్ను, కుళాయి పన్ను, ట్రెడ్ లైసెన్స్ పూర్తి సమాచారం సేకరించనుంది. అలాగే నిర్మాణాల సంఖ్య, భవన అంతస్థులు ఎత్తు, విస్తీర్ణం, ఏరియా, విద్యుత్ లైన్లు, అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్థులభవనాలు, షాపింగ్ మాల్స్, గృహాలు, వాణిజ్య సముదాయాలు, పార్కులు, ఆస్పత్రులు, లే అవుట్ ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటలు, వరద కాలువల వివరాలు, మురుగునీటి నాలాలు, తాగునీటి పైప్‌లైన్లు, విద్య, పరిశోధన సంస్థలు, డివిజన్లు, నేషనల్ హైవే, స్టేట్ హైవే, జిల్లా అను సంధాన రహదారులు, ఇతర జిల్లాల రోడ్లు, బైపాస్ రోడ్లు, రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్లు, నగరానికి సంబంధించిన ప్రధాన రహదారులు, అంతరత రహదారులు, ఇతర రోడ్ల రహదారులు, గ్రామీణ రోడ్లు, కల్వర్టులు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, వాటర్ కెనాల్, వ్యవసాయ భూముల వివరా లు, అటవీ వివరాలు, రైల్వేకు సంబంధించిన సమాచా రం, వాటి సరిహద్దుల వంటి అనేక రకాల సమాచారం ఈ సర్వేతో బల్దియా చేతిలోకి రానుంది. దీంతోపాటు ఇతరాత్ర వివరాలపై డిజిటల్ రికార్డులను తయా రవుతాయి.

సిటీ బేస్ మ్యాప్‌లో..

వరంగల్ మహానగరానికి సంబంధించి 407.77 చదరపు కిలో మీటర్ల పరిధిలో డ్రోన్ ద్వారా బేస్ మ్యాప్‌లు తయారు చేశారు. ఈ బేస్ మ్యాప్‌లో నగరానికి సంబంధించిన ప్రణాళికలు, జనాభా వివరాలు, కాలనీల పేర్లు వాటి పూర్తి వివరాలు, మునిసిపల్ ఏరియా సరిహద్దు, జోన్ సరిహద్దు, వార్డు సరిహద్దు, ట్యాక్స్ జోన్ సరిహద్దులు, వెకెట్ ల్యాండ్ వివరాలు, గృహాల వివరాలు, కమర్షియల్, ఇండస్ట్రీ భవన సముదాయాల వివరాలు, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పూర్తి వివరాలకు సంబంధించి బేస్ మ్యాప్‌లను తయారు చేయనున్నారు. వీధుల వారీగా, వార్డుల వారీగా 3-డీ సర్వే చేసి మ్యాప్‌లను సిద్ధం చేస్తారు.

డిజిటల్ మ్యాప్‌లతో ..

సమగ్ర డిజిటల్ మ్యాప్‌లతో ఇంటి నెంబర్లు, నగరంలోని వీధులు, కాలనీలను గుర్తించేలా సర్వే ఉంటుంది. ప్రతీ ఇంటిని దగ్గరి నుంచి చూసినట్లుగా 3- డీ మ్యాప్‌లు క్లిక్ చేస్తే నిర్మాణం ఎన్ని అంతస్తుల్లో ఉంది.. ఎంత విస్తీర్ణంలో నిర్మించారో వివరాలు తెలుస్తాయి. సమగ్ర డిజిటల్ మ్యాప్‌లతో ఆస్తి పన్నులు ఎక్కువ వసూలయ్యే గృహాలు, తక్కువ చెల్లించే గృహాల సంఖ్య పన్ను పరిధిలోకి రాని భవనాల వివరాలను ఈ సాంకేతికతతో గుర్తించవచ్చు. నివాస అనుమతులతో భవనాన్ని నిర్మించి అందులో వాణిజ్య కార్యకలాపాలు ఉన్నాయా తెలుసుకోవచ్చు. పన్ను విధింపులో అవకతవకలు ఈ సర్వేతో వెలుగులోకి వస్తాయి. ఆస్తి పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుందని మౌలిక సౌకర్యాల కల్పనకు, మహా నగర అభివృద్ధి ప్రణాళికలకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు అంటున్నారు.

- నగర భౌగోళిక స్వరూపాన్ని స్పష్టంగా వెల్లడించే కాంటూర్ స్థాయిలు స్పష్టమవుతాయి. తద్వారా వర్షా లు పడినప్పుడు వరద సహాయ చర్యలకు అవసరమైన తక్షణ చర్యలను పక్కాగా తీసుకునే అవకాశం ఉంటుంది.
- జీఐఎస్ సాంకేతికతతో నగరంలో డిజిటల్ ఇంటి నెంబర్ల విధానం అమలుకు ఈ మ్యాపింగ్ ఎంతగానో ఉపయోగ పడనుంది. ప్రతీ ఇంటికి డిజిటల్ నెంబర్ విధానం అమలులోకి రానుంది. డిజిటల్ ఇంటి నంబర్‌లో జోన్ నంబర్, బ్లాక్ నంబర్, రోడ్ ఐడీ, ప్రాపర్టీ ఐడీ, ప్రాపర్టీ సబ్ ఐడీ, 5డిజిట్ల ప్రాపర్టీ నంబర్‌ను ఇస్తారు. ఇందుకు సంబంధించి యూఐడీ నంబర్ ప్లేట్‌తోపాటు క్యూ ఆర్ కోడ్ ఉంటుంది.



యునెస్కో గుర్తింపు వచ్చేనా?

- మేడారం జాతరకు అర్హత ఉందంటున్న నిపుణులు
- కొంత కృషి చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్
- యునెస్కో గుర్తింపు లభిస్తే జాతరకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

హనుమకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగిన సమ్మక్క-సారలమ్మ జాతరకు యునెస్కో గుర్తింపు లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వం తలుచుకుంటే రామప్పకు మాదిరిగానే ఈ జాతరను కూడా ప్రపంచవారసత్వ సంపద జాబితాలో చేరేట్టు చేయడం అసాధ్యమేమీ కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు కోటిమందికిపైగా హాజరవుతుండడంతో ఇప్పటికే ప్రపంచం దృష్టిని ఆకర్శించినందువల్ల యునెస్కోను ఒప్పించడానికి వీలున్నదంటున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర పూర్తిగా ప్రకృతితో మమేకమై జరిగే గిరిజన పండుగ ఇది ఇంటాంజియబుల్ హెరిటేజ్ కేటగిరి కిందకు వస్తుంది. ఈ నేపథ్యంలో మేడారం జాతరకు కూడా యునెస్కో వారసత్వ హోదా లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర అనేక విశిష్టతలతో కూడిన సమాహారం. అక్కడ దేవాలయం ఉండదు. మారుమూల దట్టమైన అడవి మధ్యలో ప్రకృతి ఒడిలో కేవలం గద్దెలపైన కుంకుమ భరిణ రూపంలో సమ్మక్క - సారలమ్మ తల్లులు ఉంటారు. లక్షలాది మంది భక్తులు వచ్చి తల్లులను కొలుస్తారు. వనదేవతలపై భక్తుల్లో ఉన్న ప్రగాఢ నమ్మకానికి ప్రతీక ఈ జాతర. ఈ పరంపర కొన్ని వందల ఏళ్ల నుంచి వస్తోంది. ఇన్ని లక్షల మంది రెండేళ్లకు ఒక సారి వస్తున్నారంటే దీని వెనుక ఏదో అతీతమైన అద్భుత శక్తి ఉందనుకోవాలి. ఈ కోణం నుంచే జాతర విశిష్టత, వైవిధ్యాన్ని ఎత్తి చూపడం ద్వారా యునెస్కో గుర్తింపునకు కృషిచేయాలి. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సి ఉంటుంది.

ఇప్పటికే కొంత కృషి

జాతర వైశిష్ట్యాన్ని ప్రపంచానికి తెలియచేయడానికి కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఇప్పటికే చాలా కృషి చేసింది. జాతరపై ఇంగ్లీష్, తెలుగు భాషల్లో కాఫీ టేబుల్ బుక్‌ను ముద్రించింది. జాతరపై సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాన్ని ప్రచురించింది. జాతర గొప్పతానాన్ని ప్రతిబింబించేలా డాక్యుమెంటేషన్ కూడా చేసింది. అయితే రామప్పలాగా డోసియర్ తయారు చేయాల్సి ఉంది. ఇందుకు చాలా ఖర్చవుతుంది. ఎంతో మంది ఇందులో భాగస్వాములు కావలసి ఉంటుంది. జాతరకు సంబంధించిన ఏ చిన్న అంశం విడిచి పెట్టకుండా అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగునున్న దృష్ట్యా యునెస్కో గుర్తింపు కోసం ప్రయత్నాలను మొదలు పెడితే రామప్పకు తరహాలో మేడారం జాతరకు కూడా యునెస్కో గుర్తింపు లభించగలదన్న విశ్వాసంతో భక్తులు ఉన్నారు.



నిపుణులతో కమిటీ

జాతరకు యునెస్కో గుర్తింపు సాధించడానికి అవసరమైన ప్రాతిపదిక సౌకర్యాలను కల్పించాలి. పూర్వానుభవం కలిగిన తగిన వ్యక్తులను ఎంపిక చేసి వారితో కేంద్ర పురావస్తుశాఖ, రాష్ట్ర పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, ఇతర సాంకేతిక విభాగాలలో నిష్ణాతులైన వారితో ఒక కమిటీని వేయాలి. ఈ మేరకు ఒక డోసియర్‌ను తయారు చేయాలి. ముందు టెంటెటివ్ లిస్టులోకి వెళ్లాలి. అప్పుడే యునెస్కోలో పరిధిలోకి జాతరను తీసుకు వెళ్లడానికి మంచి అవకాశాలుంటాయి.

క్రైటేరియాను గుర్తించాలి

యునెస్కోలో గుర్తింపునకు ముందు క్రైటేరియాను గుర్తిచాలి. యునెస్కో గైడ్‌లైన్స్ చాలా సంక్లిష్టంగా ఉంటాయి. ఇంటాంజియల్ హెరిటేజ్‌గా పరిగణించే సమ్మక్క-సారలమ్మ జాతర యునెస్కోలో ఏ గైడ్‌లైన్స్‌కు కిందికి వస్తుందో గుర్తించాలి. రామప్ప దేవాలయం విషయంలో గైడ్‌లైన్స్‌లో ఒకటి, మూడు తీసుకున్నారు. అలాగే మేడారం జాతర విషయంలో కూడా గైడ్‌లైన్స్‌ను చాలా జాగ్రత్తగా గుర్తించాలి. ఆ మేరకు సమగ్ర సమాచారంతో కూడిన డోసియర్‌ను తయారు చేయాలి. జాతరకు యునెస్కో గుర్తింపు లభించినట్లయితే ప్రత్యేకంగా నిధులంటూ ఏమీ రాకపోయినా బ్రహ్మాండమైన అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది. ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారు. యునెస్కో గుర్తింపువల్ల గిరిజన జాతరపై పరంపరపై ఎలాంటి ప్రతికూల ప్రభావమూ పడదు, జాతర సంప్రదాయాలు యథావిధిగా కొనసాగుతాయి. జాతర నిర్వహణలో ఎలాంటి మార్పు ఉండదు.

డోసియర్ కీలకం

మేడారం జాతరను యునెస్కో పరిధిలోకి తీసుకురావాలంటే ముందు సమగ్రమైన డోసియర్‌ను రూపొందించాలి. ఇదేకీలకం. దీనినిబట్టే గుర్తింపు లభిస్తుంది. డోసియర్ తయారు చేయడం అంత సులభం కాదు. ఇందుకు చాలా కసరత్తు చేయాల్సి ఉంటుంది. అనేకమంది నిపుణులను భాగస్వాము లను చేయాల్సి ఉంటుంది. రామప్ప విషయంలో ఇలాగే జరిగింది. డోసియర్ తయారు చేయడానికి చాలాఏళ్లు పట్టింది. పైగా ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకుండా డోసియర్‌ను తయారు చేయడం కష్టం.


యునెస్కో గుర్తింపు సాధ్యమే

రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్



మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు లభించేలా చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. రామప్పలాగా ఈ గిరిజన జాతరపై డోసియర్ తయారు చేయాలి. ఏ క్రైటేరియా కిందకు దీనిని తీసుకురావాలో నిర్ధారించాలి. అందుకు ప్రాతిపదికను రూపొందించాలి. లోతుగా పరిశోధన జరపాలి. జాతర విశేషాలను, ప్రత్యేకతలను అన్ని కోణాల నుంచి రికార్డు చేయాలి. ఇందుకు ప్రత్యేక కమిటీలను వేయాలి. మేడారం జాతరపై కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ పక్షాన అద్భుతమైన ఛాయాచిత్రాలు, సమ్రగ సమాచారంతో కూడిన కాఫీ టేబుల్ బుక్‌ను తెలుగు, ఇంగ్లీష్ బాషల్లో ఇది వరకే తీసుకు వచ్చాం. జాతర చరిత్రను తెలిపే పుస్తకాన్ని కూడా ముద్రించాం. మేడారం జాతరకు యునెస్కో గుర్తింపు దిశగా కొంత పని అయితే ప్రాథమికంగా చేశాం. ఈ జాతర ఇంటాంజియల్ హెరిటేజ్ లేదా లివింగ్ హెరిటేజ్ కిందకు వస్తుంది. సమ్మక్క - సారలమ్మ జాతర ఈ నేలపై పరిఢవిల్లుతున్న ఒక ఆదివాసీ ప్రాచీన సాంస్కృతిక సజీవ వారసత్వ సంపద. ఈ కోణం నుంచి సరిగా ప్రాజెక్టు చేయగలిగితే జాతరకు యునెస్కో గుర్తింపు లభించడం సాధ్యమే.

మేడారం రూట్ మ్యాప్



మేడారానికి దారి అదిగో..

ములుగు, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు చేరుకునేందుకు జిల్లా పోలీసు శాఖ రూట్ మ్యాప్‌ను విడుదల చేసింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈసారి కూడా వన్‌వే అమలు చేస్తున్నారు. ఆర్టీసీ, వీవీఐపీ, వీఐపీ వాహనాలను తాడ్వాయి మీదుగా మేడారం అనుమతిస్తుండగా ప్రైవేటు వాహనాలకు మేడారం నలువైపులా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆయా రూట్లలో వచ్చే వాహనాలు నిలిపేందుకు సుమారు 1,500 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను పోలీసులు ఏర్పాటు చేశారు. అక్కడ లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు.

- వరంగల్ వైపు నుంచి మేడారం వెళ్లే వాహనదారులు హనుమకొండ, గూడెప్పాడ్, ములుగు, పస్రా, నార్లాపూర్ మీదుగా మేడారం చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో బయ్యక్కపేట, కమలాపురం క్రాస్‌రోడ్డు, పరకాల, గూడెప్పాడు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- మహారాష్ట్ర, రామగుండం నుంచి వచ్చే వాహనదారులు కాటారం, చింతకాని, యామన్‌పల్లి, పెగడపల్లి, కాల్వపల్లి మీదుగా మేడారం చేరుకోవాలి. అదే దారిలో తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంటుంది
- ఛత్తీస్‌గఢ్, భద్రాచలం, కొత్తగూడెం నుంచి వచ్చే వారు ముల్లకట్ట, ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి, దొడ్ల, కొండాయి మీదుగా ఊరట్టం నుంచి మేడారం చేరుకోవాలి. ఇదే దారిలో తిరుగు ప్రయాణం చేయాలి.

పగిడిద్దరాజు ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- ఈ ఏడాది అధికారిక లాంఛనాలతో స్వామి వారిని మేడారానికి తీసుకెళ్తాం..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



పగిడిద్దరాజు ఆలయంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి సీతక్క

గంగారం(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 : గిరిజనుల ఆరాధ్య దైవం.. సమ్మక్క పెనిమిటి పగిడిద్దరాజు ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైయున్న పగిడిద్దరాజు ఆలయంలో ఆదివారం మేడారం సమ్మక్క, సార్లమ్మ ఆలయం బోర్డు చైర్మన్ లచ్చు పటేల్ ద్వారా స్వామి వారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను ప్రధాన తలపతి(అర్చకుడు) పెనక రాజేశ్వర్‌కు అందచేశారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తలపతులకు పట్టు వస్త్రాలను ఇచ్చి, సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మారుమూలన ఉన్న పగిడిద్దరాజు ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులకు అవసరమైన మంచినీటి వసతి యుద్ధప్రాతిపదికంగా ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ ఏఈ నరేష్‌ను ఆదేశించారు. భగీరథ నుంచి నీరు రానిపక్షంలో బోరు బావులనుంచైనా ఆలయానికి మంచినీరు వసతి ఏర్పాటు చేయాలన్నారు. పగిడిద్దరాజు ఉండే వనం గుట్టకు ఇనుప కంచే ఏర్పాటు చేస్తానన్నారు. వనం వరకు సీసీ రోడ్డుకాని బీటీ రోడ్డు కానీ ఏర్పాటు చేస్తానన్నారు.

ఈ ఏడాది పగిడిద్దరాజుని పెండ్లి కుమారుడిగా అధికార లాంచనాలతో సమ్మక్క గద్దెకు తీసుకు వెళ్తామని ధనసరి సీతక్క తెలిపారు. మరుగుదొడ్ల మరమతులు చేయటమే కాకుండా, ఆలయం ప్రాంగణంలో భక్తులు ఉండేలా షెడ్లు, వంటగదులు నిర్మాణం చేస్తామన్నారు. పూనుగొండ్ల నుంచి దుబ్బగూడెం వరకు రహదారి, పూనుగొండ్ల నుంచి కరుణగండి మీదుగా కొత్తగూడకు బీటీ రోడ్డు ఏర్పాటుకు చేయాలని గిరిజనులు వినతి పత్రమిచ్చారు. చివరిగా మంత్రి సీతక్కకు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు శాలువాతో సత్కరించారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి గంగారం మండలం రావటంతో పూనుగొండ్ల ఆడబిడ్డలతో కాసేపు ముచ్చటించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ఇంటి బిడ్డగా తనతో చెప్పుకోవాలని కోరారు. వివిధ సమస్యల వినతి పత్రాలు స్వీకరించారు. పదేళ్ల నుంచి రెండో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నాము తమకు రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక ఏఎన్ఎంలు వినతి పత్రాలను ఇచ్చారు.

కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, డీడీ మంకిడి ఎర్రయ్య, డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బానోత్ రాజునాయక్ గంగారం ఎస్ఐ దిలీప్, ఐటీడీఏ ఏఈ రవి, ఎంపీపీ సువర్ణపాక సరోజన, జడ్పీటీసీ ఈసం రమ, వైస్ ఎంపీపీ సువర్ణపాక సరోజన, వజ్జా సారయ్య, చల్లా నారాయణ రెడ్డి, పగిడిద్దరాజు ఆలయ తలపతులు పెనక రాజేశ్వర్, పురుషోత్తం, రామస్వామి, సురేందర్, లక్ష్మీనర్సు పాల్గొన్నారు.



ఆలయంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలకు పూజలు చేస్తున్న సీతక్క

సేవాభావంతో విధులు నిర్వర్తించాలి

- మేడారం జాతర విధుల్లో 15వేల మంది సిబ్బంది
- టీఎస్ ఆర్టీసీ ఎమ్డీ వీసీ సజ్జనార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎమ్డీ సజ్జనార్

సుబేదారి, ఫిబ్రవరి 18 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో ఆర్టీసీ సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తించాలని టీఎస్ఆర్టీసీ ఎం.డి. వీసీ సజ్జనార్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఆరెపల్లి అయ్యప్ప టెంపుల్ సమీపంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ (జెడ్ఎస్టీసీ)లో ఆదివారం మేడారం జాతర నిర్వహణపై టీఎస్ఆర్టీసీ సిబ్బంది, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్డీ సజ్జనార్ హాజరై మాట్లాడారు. మేడారం జారతలో సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించి భక్తులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలన్నారు. భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో సిబ్బందికి కేటాయించిన స్థానాలలో మాత్రమే విధులు నిర్వహించేలా అధికారులు చూడాలని సూచించారు. భక్తులకు నిస్వార్థమైన సేవలు అందించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని, సిబ్బంది దీనిని ఒక చాలెంజ్‌గా తీసుకుని జాతరలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలన్నారు. జీరోఫెయిలూర్స్‌తోపాటు యాక్సిడెంట్ ఫ్రీగా జాతర జరిగేలా ప్రతీ ఒక్క సిబ్బంది కృషి చేయాలన్నారు. మేడారం జాతరలో 15వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని, వారికి వసతి సౌకర్యం, భోజనం విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులకు సజ్జనార్ సూచించారు.

ఈ సందర్భంగా మేడారం జాతరలో విధులు నిర్వర్తించే ఆర్టీసీ సిబ్బంది కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూపొందించిన టీషర్టులను సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీఎస్ ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, రఘునాథరావు, వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా మేడారం





వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానమాచరిస్తున్న భక్తులు

(5వ పేజీ తరువాయి)

కాల్వపల్లి, బయ్యక్కపేట, ఊరట్టం, తాడ్వాయి గ్రామాల మీదుగా వచ్చిన వాహనాలను గద్దెలకు సమీపంలోని పార్కింగ్ స్థలాలకు తరలించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. దీంతో పార్కింగ్ స్థలాలు కిటకిటలాడాయి.

మేడారం చేరుకున్న లక్నవరం నీరు

గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు నీరు మేడారానికి చేరుకుంది. మహా జాతర సందర్భంగా ఈ నెల 13న ఇరిగేషన్ అధికారులు లక్నవరం నుంచి నీటిని విడుదల చేశారు. మేడారం జంట వంతెల వరకు నీరు ఆదివారం సాయంత్రం చేరుకుంది.

రేపు గద్దెకు జంపన్న రాక

మేడారం మహాజాతరలో భాగంగా గద్దెకు జంపన్న మంగళవారం చేరుకోనున్నారు. కన్నెపల్లి నుంచి పూజారి పోలెబోయిన సత్యం వారసులు జంపన్నను అంగరంగ వైభవంగా తీసుకొస్తారు. జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. ఈనెల 24న తిరిగి వనప్రవేశం చేయిస్తారు. ప్రభుత్వ లాంఛనాలతో ఈనెల 21, 22 తేదీల్లో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెకు చేరనున్నారు.



కోడితో మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు



ఆశాలపల్లిలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంగెం, ఫిబ్రవరి 18: పేదల కోసం గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని మన అమెరికా తెలుగు సంఘం-బన్ను ఆరోగ్య సేవా సొసైటీ ప్రతినిధి చిన్నాల రాంమోహన్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆశాలపల్లిలో మహిళలకు ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆరోగ్య సేవలు అందించాలన్న లక్ష్యంతో తమ సంస్థ ప్రత్యేకంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ గానగోని శ్రీనివాస్, శ్యామలప్రదీప్, డాక్టర్ విజయ్‌భాస్కర్, వినోద్‌కుమార్, డాక్టర్ పరంజ్యోతి, రాజేందర్ పాల్గొన్నారు.



ఉర్సు బొడ్రాయి వద్ద సమావేశమైన గ్రామ పెద్దలు

ఉర్సు బొడ్రాయి పునఃప్రతిష్ఠపై సమావేశం

కరీమాబాద్, ఫిబ్రవరి 18: ఉర్సు బొడ్రాయి పునఃప్రతిష్ఠ విషయమై ఆదివారం ఉర్సు శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలోని ధర్మశాలలో గ్రామ పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. సమావేశంలో గ్రామపెద్దలు, కుల సంఘాలు, యువకులు సమావేశమై వేదపండితులు వెలిది యుగేందర్‌శర్మ, వెలిదె అనంతమూర్తి శర్మ నిర్ణయించిన ముహూర్తం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠ సమావేశాన్ని చిన్న మహంకాళి ఆలయంలో అన్ని వర్గాల ప్రజలతో వచ్చే నెల మార్చి 3వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా రాజేష్



కొత్తపల్లి రాజేష్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 18: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ ఉపాధ్యక్షుడిగా రామన్నపేటకు చెందిన కొత్తపెల్లి రాజేష్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు అప్పరాజు రాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి దశ నుంచి ప్రజా సేవకుడిగా మంచి గుర్తింపు పొందిన రాజేష్ మరింత సేవలందించడానికి అర్బన్ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లుగా తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కరీమాబాద్, ఫిబ్రవరి 18: గంజాయి సరఫరా కేసులో ఓ వ్యక్తిని మిల్స్‌కాలనీ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ మల్లయ్య వెల్లడించారు. ఉర్సు దర్గా సమీపంలో నివాసం ఉండే జమీర్ అన్సారీ ఇంట్లో గంజాయి నిలువలు ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎస్సై వెంకన్న తన సిబ్బందితో శనివారం మధ్యాహ్నం జమీర్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జమీర్ ఇంటి పెరట్లో ఏపుగా పెరిగిన 5 గంజాయి మొక్కలు కనిపించాయి. అలాగే ఇంట్లో ఓ ఎరుపు రంగు క్యారీ బ్యాగులో 1.5 కేజీల ఎండు గంజాయి లభించింది. జమీర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకన్న, గోవర్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు చెన్నారం విద్యార్థిని



గొర్రె శ్రీవిద్య

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 18 : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన గొర్రె శ్రీవిద్య అనే విద్యార్థిని అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గ్రామస్థులు శ్రీవిద్యను అభినందించారు. నేషనల్ యూత్ గేమ్స్ కౌన్సిల్ ఇండియా 2024 కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున గోవా రాష్ట్రంలో జాతీయ స్థాయిలో రాణించి, అంతర్జాతీయ స్థాయికి ఎంపికైంది. చెన్నారం గ్రామానికి చెందిన గొర్రె సుధాకర్-రజిత దంపతుల కూతురు శ్రీవిద్య, ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెయింట్ మేరీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్‌లో డిప్లమా తృతీయ సంవత్సరం సీఎస్ఈ గ్రూపు చదువుతోంది. కబడ్డీపై ఉన్న ఆసక్తితో అంతర్జాతీయ స్థాయికి వెళ్లడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 10 నుంచి నేపాల్ దేశంలో జరిగే కబడ్డీ పోటీలకు తెలంగాణ తరఫున ఆడేందుకు శ్రీవిద్య సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

తాత్కాలిక బస్టాండ్‌లో సమస్యలు

వరంగల్‌లో మూడే మరుగుదొడ్ల ఏర్పాటు

కానరాని తాగునీటి వసతి

బస్‌స్టేషన్‌లోకి ఇష్టారాజ్యంగా ప్రయివేట్ వాహనాలు



ఆదివారం మేడారం బయలుదేరుతున్న బస్సు

గిర్మాజీపేట, ఫిబ్రవరి 18 : మేడారం మహా జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ వరంగల్‌లో తాత్కాలిక బస్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ బస్టాండ్ మౌలిక వసతులు ఆర్టీసీ కల్పించకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు వసతి, క్యూలైన్‌లు సరిగా లేకపోవడం, బస్‌ల ప్రాంగణంలో విచ్చలవిడిగా ఆటోలు, ప్రయివేట్ వాహనాల వస్తుండడంతో ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు. గతేడాది వరకు మేడారం బస్సుల పాయింట్‌ను పండ్ల మార్కెట్‌లో ఏర్పాటు చేశారు. భక్తులకు కూడా సౌకర్యవంతంగా ఉండేది. వివిధ ప్రాంతాల నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి పండ్ల మార్కెట్‌కు కాలినడకన వెళ్లి మేడారం బస్‌లు ఎక్కేవారు. అయితే పండ్ల మార్కెట్‌లో నూతన మార్కెట్ నిర్మాణం జరుగుతుండటంతో మేడారం బస్‌ల పాయింట్‌ను వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేశారు. ఎస్ఎన్ఎం క్లబ్ ముందు ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్ షెల్టర్‌లో క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే రైల్వేస్టేషన్ ముందు ప్రధాన రహదారిపై చలువ పందిళ్లు, అధికారుల కోసం టెంట్ ఏర్పాటు చేశారు.



మేడారం బస్‌ల రాకపోకలకు అడ్డంగా ఆటోలు

మూడే మరుగుదొడ్లు...

ఈ వారం రోజుల్లో మేడారానికి నిత్యం వేలాదిమంది వరంగల్ తాత్కాలిక బస్టాండ్ నుంచి భక్తులు రాకపోకలు సాగించనున్నారు. కానీ, ఇక్కడ కేవలం మూడే మరుగుదొడ్లను అధికారులు ఏర్పాటు చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. అవికూడా బస్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా తాత్కాలిక బస్‌స్టేషన్ కోసం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసినవే. కేవలం మూడు మరుగుదొడ్లు వేలాది భక్తుల అవసరాలు ఎలా తీర్చుతాయని ప్రశ్నిస్తున్నారు. రైల్వేస్టేషన్ వద్ద సులభ్ కాంప్లెక్స్ ఉన్నా, నిత్యం రైల్వే ప్రయాణికులతోనే రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, మొబైల్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆదివారం వరకు భక్తులకు తాగునీరు సదుపాయం ఏర్పాటుచేయలేదు.

ఇష్టారాజ్యంగా ప్రయివేట్ వాహనాలు...

రైల్వేస్టేషన్ వైపు, వెంకట్రామ జంక్షన్ నుంచి రాంకీ మీదుగా మేడారం ఆర్టీసీ పాయింట్ వైపు ప్రయివేట్ వాహనాలు, ఆటోల రాకపోకలు నిషేధించినట్లు ఆర్టీసీ, పోలీసు అధికారులు చెబుతున్నా అవి అమలుకావడం లేదు. ఆదివారం కూడా ఆటోలు, ప్రయివేట్ వాహనాలు విచ్చలవిడిగా వరంగల్ జిల్లా, సిటీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో, ప్రవేశ ద్వారా వద్ద రోడ్లపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ వైపు ప్రయివేట్ వాహనాలను గోవిందరాజుల గుట్ట ఆర్చ్ వద్దనే నిలిపివేస్తూ బారికేడ్లు పెట్టాల్సి ఉంది. అలాగే వెంకట్రామ జంక్షన్ నుంచి రైల్వే, బస్‌స్టేషన్‌కు ప్రయివేట్ వాహనాలు నిలిపివేస్తూ వైపు బారికేడ్లు పెట్టాలి. ప్రైవేటు వాహనాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఇదిలాఉంటే మేడారం బస్సులు బయటకు పోయేమార్గం, ఇతర ప్రాంతాల నుంచి నిత్యం వచ్చే బస్‌ల రాకపోకల మార్గం ఒకటే కావడంతో బస్సులు ఎదురెదురుగా వస్తుండటం పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడు ఈ మార్గంలో రోడ్డుపైనే ఆటోలు పార్కింగ్ చేసి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భక్తులు జంకుతున్నారు.

నిఘా పెట్టాలి..

తాత్కాలిక బస్ పాయింట్ల వద్ద నిరంతర నిఘా పెట్టాలని భక్తులు కోరుతున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగతనాలు జరిగే అవకాశముందని పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వెంకట్రామ జంక్షన్ నుంచి క్యూలైన్లు, చలువ పందిళ్లు, మేడారం బస్సులు రాకపోకలు సాగించే ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పిల్లలు తప్పిపోతే ఫిర్యాదు చేయగానే తక్షణం స్పందించేలా పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలంటున్నారు.

అశోక్‌కు ప్రజా సంఘాల సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీమాబాద్, ఫిబ్రవరి 18: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ హోమియోపతి సెమినార్‌లో అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను ఆదివారం కరీమాబాద్‌లోని ఎస్ఆర్ఆర్ తోటలో పలు ప్రజా సంఘాలు సన్మానించాయి. భారతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో డాక్టర్లు, పద్మశాలి, బీసీ సంఘాలతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా మానుకోట జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక్ జాతీయ అవార్డును పొందడం అభినందనీయమన్నారు. కరోనా కష్టకాలంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలు 178 రోజులపాటు 13,600 కి.మీటర్లు బైక్ ప్రయాణం చేసి 1860 చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 8 లక్షల మందికి ఉచితంగా హోమియోపతి మందులను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి రిటైర్డ్ ఎంపీడీవో గుల్లేపల్లి విద్యాసాగర్, తెలంగాణ నేత్ర, శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర నాయకులు కొండ్రెడ్డి మల్లారెడ్డి, పంచాయితీరాజ్ ఇంజినీర్ల సంఘం నాయకులు ఆడెపు సుధాకర్, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు తేరాల యుగేంధర్, ఆదర్శనగర్ కాలనీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి లక్నవరం సందర్శన బంద్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 18: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పర్యాటక కేంద్రం లక్నవరం సరస్సు సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని ఈనెల 19 నుంచి 26 వరకు బంద్ చేయనున్నామని, పర్యటకులు ఎవరూ రావద్దని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాజాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

అగ్రంపహాడ్ జాతర అభివృద్ధికి చేయూత

గీసుగొండ, ఫిబ్రవరి 18: మనుగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మక్క జాతరలో అభివృద్ధి పనులకు ఆర్థిక చేయూతనిచ్చినట్లు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆదేశంతో రూ. 4లక్షల సొంత ఖర్చులతో ప్రత్యేక దర్శనం కోసం స్టీల్ రేలింగ్ క్యూలైన్‌లను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. మనుగొండలో నిరుపేద కుటుంబానికి చెందిన చాపర్తి కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో కాలు విరగగా అతడికి రూ. 5 వేల ఆర్థికసాయాన్ని కిశోర్‌రెడ్డి ఆదివారం అందించారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి చిన్నారి మృతి



ఎస్సారెస్పీకాలువలో నుంచి వెలికితీసిన సంజన మృతదేహం

కేసముద్రం, ఫిబ్రవరి 18 : మండలంలోని తౌర్యతండా జీపీ పరిధిలోని మూలస్తంభం వద్ద ఎస్సారెస్పీ కాలువలో నాలుగేళ్ల చిన్నారి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం సాయంత్రం గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గారడీ ప్రదర్శనలు చేసుకుని జీవించే సమాని రవి-సంధ్య దంపతుల కుమార్తె సంజన (4) పర్వతగిరి మండలం ఇస్లావత్‌తండా సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో పడినట్లు తెలిపారు. అక్కడ్నుంచి నీటిలో కొట్టుకు వస్తున్న మృతదేహాన్ని మూలస్తంభం వద్ద స్థానికులు గుర్తించి, వెలికి తీశారు. రెండు గారడీ కుటుంబాలు ఆదివారం ఉదయం ఇస్లావత్ తండాకు చేరుకుని రాత్రి ప్రదర్శన నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30 గంటలకు సంజన కన్పించడంలేదంటూ డయల్ 100కు తండవాసులు ఫోన్ చేశారు. ఈ మేరకు సంజన ఆచూకీ కోసం వెతుకుతుండగా కాలువలో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ఆ చిన్నారి కాలువలో ఎలా పడిందన్న విషయంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా బాలికను గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై కిడ్నాప్ చేసి, ఎత్తుకెళ్లి కాలువలో పడేసినట్లు ఇస్లావత్‌తండాలో ప్రచారం జరిగింది.

హత్య కేసులో నిందితుల అరెస్టు



అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై పరమేశ్

దుగ్గొండి, ఫిబ్రవరి 18 : మద్యానికి బానిసై భార్యను డబ్బుల కోసం వేధించిన భర్తను చంపిన భార్యతో పాటు సహకరించిన కుటుంబ సభ్యులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని మైసంపల్లికి చెందిన జెరిపో తుల రాజు మద్యం తాగి భార్య లక్ష్మీని డబ్బుల కోసం వేధించగా, శుక్రవారం అర్ధరాత్రి రాజును భార్య లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు కలసి రాళ్లతో కొట్టి, ఉరితీసి చంపిన విష యం పాఠకులకు విదితమే. రాజును హత్య చేసిన భార్య లక్ష్మీ, చిన్న కుమారుడు సూర్య కుమార్తె మాధవి, అల్లుడు రాకేశ్, మరో బంధువు తరుణ్‌లను అరెస్టు చేసి నట్లు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. అరెస్టు కార్యక్రమంలో ఎస్సై పరమేశ్ పాల్గొన్నారు.

బయ్యారం ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

• రూ. 29 లక్షల అపహరణ • అంతరాష్ట్ర దొంగలుగా అనుమానం • సందర్శించిన ఏఎస్పీ చెన్నయ్య



ఏటీఎంలో ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్ టీం పోలీసులు

బయ్యారం, ఫిబ్రవరి 18 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. అంతరాష్ట్ర దొంగల ముఠా గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి రూ. 29.78లక్షల డబ్బును ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీసీ టీవీ ఫుటేజీ ప్రకారం.. కారులో నలుగురు వ్యక్తులు వచ్చి బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌కు కొంత దూరంలో ఆగారు. కొంతసేపు తర్వాత కారులో నుంచి ఓ వ్యక్తి దిగి, ఏటీఎం వద్దకు వెళ్లి గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను పగలగొట్టాడు. అందులోని రూ.29.78 లక్షల నగదు అపహరించినట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. చోరీ తీరును బట్టి అంతరాష్ట్ర ముఠాగా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ద్వారా ఆనవాళ్లు సేకరిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు. బ్యాంకు సిబ్బంది, సీఎంఎస్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నెవార్ బ్యాచ్ పనేనా..!?

బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌లో జరిగిన చోరీ హర్యానాకు చెందిన నెవార్ బ్యాచ్ పనేనా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. తాళం వేసిన ఇళ్లల్లో ఎలాగైతే చెడ్డీ గ్యాంగ్ చోరీకి పాల్పడుతున్న విధంగానే, ఈ నెవార్ బ్యాచ్ కూడా కేవలం ఏటీఎంలనే టార్గెట్ చేస్తూ చోరీలకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ బ్యాచ్ కొంత కాలంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని ఏటీఎంలను టార్గెట్ చేస్తూ చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఒక ప్రాంతంలోని ఏటీఎంను ఎంచుకుంటున్న ఈ ముఠాసభ్యులు ముందుగా ఆ ప్రాంతంలో కొంత కాలం పాటు రెక్కీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సెల్ టవర్ సిగ్నల్స్‌కు కూడా దొరకకుండా ఫేక్ సిమ్‌లతో సంచరిస్తున్న ఈ ముఠా సభ్యులు చాలా జాగ్రత్తగా ఏటీఎంల చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసింది. ఒక ఏటీఎంపై పూర్తిగా అవగాహనకు వచ్చిన తరువాత గ్యాస్ కట్టర్ల సాయంతో మిషన్‌లో చోరీకి యత్నించి, నగదును అపహరిస్తున్నట్లు సమాచారం. కాగా, కొద్ది కాలంగా ఈ నెవార్ బ్యాచ్ చేస్తున్న చోరీలు పోలీసులకు సవాల్‌గా మారింది. క్లూస్ టీంకు కూడా ఆనవాళ్లు దొరకకుండా ముఠా సభ్యులు చాలా పకడ్బందీగా చోరీలకు పాల్పడుతుండటం పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది.

నర్సంపేట డిపో నుంచి మేడారం జాతరకు 245 బస్సులు



క్యూ లైన్ టికెట్ కౌంటర్ ప్రారంభిస్తున్న డిపో మేనేజర్

నర్సంపేట, ఫిబ్రవరి 18 : ఆసియా ఖండం లోనే అతిపెద్ద జాతరైన సమ్మక్క-సారలమ్మ జా తరకు నర్సంపేట డిపో నుంచి 245 బస్సులను ఏర్పాటుచేసినట్లు డిపో మేనే జర్ ప్రసూనలక్ష్మి అన్నారు. బస్టాండ్ ఆవ రణలో కూలైన్, బుకింగ్ కౌంటర్ల ద్వారా జాతరకు వెళ్ళే బస్సును ఆదివారం డిపో మేనేజర్ ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో మూడు క్యూ లైన్ కౌంటర్లు, తాగునీటి సౌకర్యం, వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. డిపో ఉద్యోగులు భక్తులకు మెరుగైన సేవలను అందించి మేడారం జాతరను విజయవంతం చేయాలని ఆమె కోరారు. క్యూ లైన్ ద్వారా టికెట్ తీసుకొని జాతరకు వెళ్ళే బస్సులను ఎక్కాలని సూచించారు. మోడారంలో సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని క్షేమంగా తిరిగి రావాలని కోరారు. కార్య క్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, డీసీ భద్రయ్య, ఈడబ్ల్యూజీ సభ్యులు స్వామి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, సేఫ్టీ వార్డెన్ అనుమాండ్ల మహిపాల్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్లం పక్కదారి!

ఎత్తుబంగారం పేరుతో గుడుంబా కోసం తరలింపు..

నగరంలో వ్యాపారుల సిండికేట్

మారుమూల గ్రామాలకు సరఫరా

అమ్మకాలపై దృష్టి సారించని అధికారులు



సంగెం, ఫిబ్రవరి 18 : బెల్లం అమ్మకాలు పక్కదారి పడుతున్నాయి. మేడారం మహజాతర పేరుతో కొనుగోలు చేస్తున్న బెల్లం మారుమూల గ్రామాల్లో గుడుంబా తయారీకి తరలిపోతోంది. మేడారం వెళ్లే భక్తులు తల్లులకు బెల్లాన్ని(బంగారంగా) కానుకల రూపంలో ఇవ్వడం ఆనవాయితీ. ఇందుకోసం ప్రభుత్వం బెల్లం అమ్మకాలపై నిబంధనలు సడలించింది. ఇదే అదునుగా భావించిన గుడుంబా తయారీదారులు అక్రమంగా బెల్లాన్ని గుట్టుచప్పుడు కాకుండా గ్రామాలకు, తండాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు సైతం సిండికేట్‌గా మారి ధరలను పెంచి అమ్మకాలు చేస్తున్నారు. ఫలితంగా కిలోకు రూ.40 దొరకాల్సిన బెల్లం రూ.50 దాటింది. గ్రామీణ ప్రాంతాల్లో అక్కడి వ్యాపారులు చెప్పిందే బెల్లం రేటు అన్నట్టుగా సాగుతోంది. సాధారణ రోజుల్లో ఆధార్‌కార్డు ఆధారంగా వ్యాపారులు బెల్లం విక్రయించేవారు. మహజాతర నేపథ్యంలో వాటిని సడలించడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

● మహారాష్ట్ర నుంచి దిగుమతి...

వరంగల్ ఉమ్మడి జిల్లాకు బెల్లం మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతోంది. కొందరు వ్యాపారులు బిల్లుల రూపంలో దిగుమతి చేసుకున్నా, మరికొందరు మాత్రం జీరో దందా సాగిస్తూ లారీల ద్వారా రైళ్లలో రాత్రి వేళల్లో దిగుమతి చేసుకుంటున్నారు. మండలాల్లో రైలు మార్గాలు ఉన్న చోట నేరుగా అక్కడి సిండికేట్ వ్యాపారులకే బెల్లాన్ని దిగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో స్థానికంగా ఉండే గ్రామాలు, తండాలు బెల్లాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేసి గుడుంబా తయారీకి వినియోగిస్తున్నారు. వరంగల్ నగరంలోని కొంత మంది అధికారుల అండదండలతో ఈ అమ్మకాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. వ్యాపారులు లైసెన్సులు పొంది సిండికేట్‌గా ఏర్పడి బెల్లాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరంగల్ నగరంలోని పాతబీటు బజార్‌లోని దుకాణాల్లో బెల్లం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పాతబీటు బజారులో గల కిరాణా దుకాణాలతోపాటు ప్రత్యేక దుకాణాలు సైతం వెలిశాయి. జాతర సమయంలో అధికంగా దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు.

● ఏజెంట్ల ద్వారా సరఫరా..

గతంలో వరంగల్ జిల్లాను రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు గుడుంబారహిత జిల్లాగా గుర్తించి అవార్డును సైతం ఇచ్చారు. బెల్లం అమ్మకాలు పూర్తిస్థాయిలో నిషేధించిన అధికారులు ఇతర రాష్ట్రాల నుంచి చాటుమాటుగా వస్తున్న బెల్లం వాహనాలపై దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకునేవారు. అయినా అక్రమంగా వివిధ మార్గాల్లో తండాలకు బెల్లాన్ని చేరవేస్తున్నారు.

● ప్రభుత్వం దృష్టి సారించాలి..

మహజాతర పేరుతో బెల్లం దందా యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తూతూ మంత్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేయడం తప్ప, చేసింది శూన్యమని పలువురు పేర్కొంటున్నారు. వరంగల్ మహానగరం నుంచే బెల్లం సరఫరా అవుతున్నా అధికారుల్లో చలనం లేకుండాపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు.

బెల్లం రవాణాపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం..



వరంగల్ జిల్లాలో బెల్లం రవాణాపై ప్రత్యేక దృష్టిని పెట్టాం. అదే విధంగా గుడుంబా తయారితో పాటు అమ్మకాలపై నిరంతరం దాడులు చేస్తున్నాం. గుడంబా తయారి కోసం ఉపయోగించే బెల్లం, పటికలను అమ్మకాలు చేసే వారిపై నిఘా పెట్టాం.

జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్‌నాయక్



అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు చెన్నారం విద్యార్థిని

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 18 : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన గొర్రె శ్రీవిద్య అనే విద్యార్థిని అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గ్రామస్థులు శ్రీవిద్యను అభినందించారు. నేషనల్ యూత్ గేమ్స్ కౌన్సిల్ ఇండియా 2024 కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున గోవా రాష్ట్రంలో జాతీయ స్థాయిలో రాణించి, అంతర్జాతీయ స్థాయికి ఎంపికైంది. చెన్నారం గ్రామానికి చెందిన గొర్రె సుధాకర్-రజిత దంపతుల కూతురు శ్రీవిద్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెయింట్ మేరీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లమా తృతీయ సంవత్సరం సీఎస్ఈ గ్రూపు చదువుతోంది. కబడ్డీపై ఉన్న ఆసక్తితో అంతర్జాయ స్థాయికి వెళ్లడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 10 నుంచి నేపాల్ దేశంలో జరిగే కబడ్డీ పోటీలకు తెలంగాణ తరఫున ఆడేందుకు శ్రీవిద్య సిద్ధమవుతున్నట్లు తెలిపింది.


గొర్రె శ్రీవిద్య

నర్సంపేట డిపో నుంచి
మేడారం జాతరకు 245 బస్సులు


క్యూ లైన్ టికెట్ కౌంటర్ ప్రారంభిస్తున్న డిపో మేనేజర్

నర్సంపేట, ఫిబ్రవరి 18 : ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరైన సమ్మక్క-సారలమ్మ జాతరకు నర్సంపేట డిపో నుంచి 245 బస్సులను ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అన్నారు. బస్టాండ్ ఆవరణలో క్యూలైన్, బుకింగ్ కౌంటర్ల ద్వారా జాతరకు వెళ్లే బస్సును ఆదివారం డిపో మేనేజర్ ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో మూడు క్యూ లైన్ కౌంటర్లు, తాగునీటి సౌకర్యం, వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. డిపో ఉద్యోగులు భక్తులకు మెరుగైన సేవలను అందించి మేడారం జాతరను విజయవంతం చేయాలని ఆమె కోరారు. క్యూ లైన్ ద్వారా టికెట్ తీసుకొని జాతరకు వెళ్లే బస్సులను ఎక్కాలని సూచించారు. మేడారంలో సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని క్షేమంగా తిరిగి రావాలని కోరారు. కార్య క్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, డీసీ భద్రయ్య ఈడబ్ల్యూజీ సభ్యులు స్వామి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, సేఫ్టీ వార్డెన్ అనుమాండ్ల మహిపాల్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మేడారం జాతర కానుకగా చీరల పంపిణీ


మైలారంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి, ఫిబ్రవరి 18 : మేడారం సమ్మక్క సారలమ్మల జాతరను పురస్కరించుకొని పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పేద మహిళలకు చీరలను కానుకగా పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మండలంలోని మైలారం, జగన్నాథపెల్లి, గట్టికల్, ఊకల్ తదితర గ్రామాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌లు పలువురు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వెళ్తున్న మహిళలు కొత్త చీరలు ధరించి వెళ్లి తల్లుల ఆశీర్వాదం పొందాలని ఝాన్సీరెడ్డి తలిచారని సూచించారు.

ఎస్సీ బాలికల హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి


ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 18 : పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ బాలికల హాస్టల్ ఆదివారం సందర్శించాక అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య సహాయ కార్యదర్శి వంగల రాగసుధ, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు మార్త నాగరాజు, ప్రజా సంఘాల నాయకుడు కొత్తకొండ రాజమౌళి మాట్లాడుతూ ఎస్సీ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. హాస్టల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థినీలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నీటి సౌకర్యంలేక స్నానాలు చేయడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. కార్య క్రమంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాల్యంలోనే తుంచేద్దాం..!

- వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతోనే నియంత్రణ
- అవగాహన పెంచుకోవాలంటున్న ఆరోగ్యశాఖ
- జిల్లాలో 1-19 వయసు గల వారు 1,90,718 మంది

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 18 : పిల్లల పట్ల ఎంత శ్రద్ధ చూపిన వారు చేసే చిన్నచిన్న పొరపాట్ల వల్ల వారి ఆరోగ్యానికి తెలియకుండానే అతి భయంకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇలాంటి వాటిని బాల్యంలోనే తుంచేయాలని కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య సంస్థలు చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా చిన్న పిల్లలకు రెండు రకాలుగా వ్యాధులు సోకే అవకాశం ఉన్నట్లు తేలింది. అపరిశుభ్రత వలన నులిపురుగుల వ్యాధి రావడం జరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ముందస్తు ప్రణాళికతో వ్యాధులను నియంత్రించడానికి వైద్యశాఖ జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తోంది. విద్యాశాఖ సహకారంతో అధికారుల సమన్వయంతో ముప్పును అధిగమించడానికి అడుగులు వేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నివారణ మందులను అందించింది. అందుకే ఈనెలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం ప్రారంభించి 1-19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల మాత్రలు వేయనున్నారు.

• నులి పురుగుల లక్షణం...

పిల్లల పేగులో తిష్టవేసి పోషకాలను శరీరానికి అందకుండా చేసే పరాన్న జీవులే నులిపురుగులు. పేగుల్లోకి నులిపురుగులు చేరితే చిన్నారులు పోషకాహార లోపంతో చిక్కి శల్యమవుతారు. నేలలో ఉండే ఈ పరాన్నజీవులు నీటిద్వారా, ఆహారం ద్వారా కడుపులోకి చేరుతాయి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం, చేతులు కడుక్కోకుండా ఆహారాన్ని భుజించడం వల్ల సంక్రమిస్తాయి. ఇందులో మూడు రకాల నులి పురుగులు ఉంటాయి. ఏలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులు. పిల్లలు నులిపురుగుల ప్రభావానికి లోనలై పోషకాహార లోపం తలెత్తుతుంది. ఆకలి మందగిస్తుంది. రక్తహీనత, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. నులిపురుగులకు నిర్లక్ష్యం చేయడం వలన దీర్ఘకాలిక సమస్యలు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మానసిక, శారీరక అభివృద్ధి మందగించడంతో పాటు వ్యాధుల బారిన పడిన వారికి ఏకాగ్రత తగ్గిపోతుంది.

• నులిపురుగుల వ్యాప్తిని నివారించడం ఇలా...

పరిసరాల పరిశుభ్రత, ముఖ్యంగా భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో కడుక్కోవాలి. సురక్షితమైన నీటిని తాగడం, వేడి ఆహారాన్ని తీసుకోవడం, అన్ని వేళలా ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం, తినే వస్తువులను నీటితో శుభ్రంగా కడగటం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా పిల్లల చేతికి ఉన్న వేళ్ల గోళ్లను తీయడం, ప్రతికూల ప్రభావాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

• వరంగల్ జిల్లాలో...

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమయాత్తమైంది. ప్రభుత్వ ఆదేశాల రావడంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. దీని కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీపీపీ ఆరోగ్య కేంద్రాల్లో నివారణ మందులు అందుబాటులో ఉంటాయి. ఈ కేంద్రాల వారిగా 1-19 వయసు గల వారిని గుర్తించారు. జిల్లాల్లో మొత్తం 1,90,718 పిల్లలకు వేసేందుకు నివారణ మందులను సిద్ధం చేసి ఉంచినట్లు వైద్య ఆరోగ్య శాఖ లెక్కలు చెపుతున్నాయి. ఈ నెల 20 నుంచే నివారణ దినోత్సవాన్ని నిర్వహించి పంపిణీ చేయాలని ఆలోచించినప్పటికీ మేడారం జాతర ఉండడంతో వాయిదా వేసుకున్నట్లుగా తెలుస్తోంది.

• పాఠశాలలనే కీలకంగా తీసుకున్నాం...

డాక్టర్ ఎన్.గోపాల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో



వరంగల్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలనే కీలకంగా తీసుకుని నులి పురుగుల నివారణ మాత్రలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇక కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో సైతం ఆరోగ్య సిబ్బంది వేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. బాల్యంలోనే ఇలాంటి వ్యాధులను తుంచేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. దీనిని సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రజలు ముందుకు వచ్చి నివారణ మాత్రలు వేయించాలి.

ఘనంగా ఉషాదయాకర్ రావు జన్మదిన వేడుకలు

రాయపర్తి, ఫిబ్రవరి 18 : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రా వు సతీమణి, ఎర్రబెల్లి ట్రస్టు చైర్మన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు జన్మదిన వేడుకలు ఆది వారం మండల కేం ద్రంలోని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ రంగు కుమార్, కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఐత రాంచందర్, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, నాయకులు ఎండీ నయీం, ఎండీ అక్బర్, అనిల్, యాదగిరి, సింహాద్రి, సంతోష్, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్నవరం సందర్శన బంద్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 18: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పర్యాటక కేంద్రం లక్నవరం సరస్సు సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరిం చుకుని ఈనెల 19 నుంచి 26 వరకు బంద్ చేయనున్నామని, పర్యటకులు ఎవరూ రావద్దని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాజాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

కుల గణన చేపట్టి.. చట్టబద్ధత కల్పించాలి


మాట్లాడుతున్న తుమ్మల కుమారస్వామి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 18 : కులగణన చేపట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ 1931 సంవత్సరాల తర్వాత మళ్లీ ఇప్పుడు కుల గణన చేపట్టడం హర్షనీయమన్నారు. కులగణన ద్వారా ఎస్సీ బీసీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో దళిత నిరుపేద సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బయ్యారం ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

రూ. 29 లక్షల అపహరణ - అంతరాష్ట్ర దొంగలుగా అనుమానం - సందర్శించిన ఏఎస్పీ చెన్నయ్య


ఏటీఎంలో ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్ టీం పోలీసులు

బయ్యారం, ఫిబ్రవరి 18 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. అంతరాష్ట్ర దొంగల ముఠా గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి రూ. 29.78లక్షల డబ్బును ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్పీ చెన్నయ్య డీఎస్పీ తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీసీ టీవీ పుటేజీ ప్రకారం.. కారులో నలుగురు వ్యక్తు లు వచ్చి బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌కు కొంత దూరంలో ఆగారు. కొంతసేపు తర్వాత కారులో నుంచి ఓ వ్యక్తి దిగి, ఏటీ ఎం వద్దకు వెళ్లి గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను పగలగొట్టాడు. అందులోని రూ.29.78 లక్షల నగదు అపహరించినట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు. చోరీ తీరును బట్టి అంతరాష్ట్ర ముఠాగా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ద్వారా ఆనవాళ్లు సేకరిస్తున్నామని, త్వరలోనే నిందితులనుపట్టుకుంటామని వెల్లడించారు. బ్యాంకు సిబ్బంది, సీఎంఎస్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నెవార్ బ్యాచ్ పనేనా..!?

బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌లో జరిగిన చోరీ హర్యానాకు చెందిన నెవార్ బ్యాచ్ పనేనా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. తాళం వేసిన ఇళ్లల్లో ఎలాగైతే చెడ్డీ గ్యాంగ్ చోరీకి పాల్పడుతున్న విధంగానే, ఈ నెవార్ బ్యాచ్ కూడా కేవలం ఏటీఎంలనే టార్గెట్ చేస్తూ చోరీలకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ బ్యాచ్ కొంత కాలంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని ఏటీఎంలను టార్గెట్ చేస్తూ చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఒక ప్రాంతంలోని ఏటీఎంను ఎంచుకుంటున్న ఈ ముఠాసభ్యులు ముందుగా ఆ ప్రాంతంలో కొంత కాలం పాటు రెక్కీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సెల్ టవర్ సిగ్నల్స్‌కు కూడా దొరకకుండా ఫేక్ సిమ్‌లతో సంచరిస్తున్న ఈ ముఠా సభ్యులు చాలా జాగ్రత్తగా ఏటీఎంల చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసింది. ఒక ఏటీఎంపై పూర్తిగా అవగాహనకు వచ్చిన తరువాత గ్యాస్ కట్టర్ల సాయంతో మిషన్‌లో చోరీకి యత్నించి, నగదును అపహరిస్తున్నట్లు సమాచారం. కాగా, కొద్ది కాలంగా ఈ నెవార్ బ్యాచ్ చేస్తున్న చోరీలు పోలీసులకు సవాల్‌గా మారింది. క్లూస్ టీంకు కూడా ఆనవాళ్లు దొరకకుండా ముఠా సభ్యులు చాలా పకడ్బందీగా చోరీలకు పాల్పడుతుండటం పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది.

ఎస్సారెస్పీ కాలువలో పడి చిన్నారి మృతి


సంజన మృతదేహం

కేసముద్రం, ఫిబ్రవరి 18 : మండలంలోని తౌర్యతండా జీపీ పరిధిలోని మూలస్తంభం వద్ద ఎస్సారెస్పీ కాలువలో నాలుగేళ్ల చిన్నారి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం సాయంత్రం గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గారడీ ప్రదర్శనలు చేసుకుని జీవించే సమాని రవి-సంధ్య దంపతుల కుమార్తె సంజన (4) పర్వతగిరి మండలం ఇస్లావత్‌తండా సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో పడినట్లు తెలిపారు. అక్కడ్నుంచి నీటిలో కొట్టుకు వస్తున్న మృతదేహాన్ని మూలస్తంభం వద్ద స్థానికులు గుర్తించి, వెలికి తీశారు. రెండు గారడీ కుటుంబాలు ఆదివారం ఉదయం ఇస్లావత్‌తండాకు చేరుకుని రాత్రి ప్రదర్శన నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30 గంటలకు సంజన కన్పించడంలేదంటూ డయల్ 100కు తండవాసులు ఫోన్ చేశారు.

ఈ మేరకు సంజన అచూకీ కోసం వెతుకుతుండగా కాలువలో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ఆ చిన్నారి కాలువలో ఎలా పడిందన్న విషయంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా బాలికను గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై కిడ్నాప్ చేసి, ఎత్తుకెళ్లి కాలువలో పడేసినట్లు ఇస్లావత్‌తండాలో ప్రచారం జరిగింది.

ప్రమాదకరంగా నీటి సంపులు

ఆజాగ్రత్త చర్యలతో పసి ప్రాణాలు బలి

సంపులలో పడి మృతి చెందిన సంఘటనలు

దుగ్గొండి, పిబ్రవరి 18 : ఇళ్లలో నీటి వసతి కోసం ఏర్పాటు చేసుకున్న నీటి సంపులు పసిపాపల పాలిట మృత్యుకుహరాలుగా తయారవుతున్నాయి. ఆడుతూ పాడుతూ ప్రమాదవశాత్తు సంపులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్న అజాగ్రత్త పెద్ద ప్రమాదానికి దారి తీస్తోంది. బాధిత కుటుంబాలు విషాదంలో మునిగిపోవలసివస్తోంది. ఉమ్మడిజిల్లాలో నీటి సంపులో చిన్నారులు పడిచనిపోయిన సంఘటనలు తరచుగా జరుగుచున్నాయి. మండలంలో 12,096 నివాస గృహాలు ఉండగా, 80 శాతం నివాస గృహాలలో నీటి సంపులు ఉన్నాయి. నీటి సంపుల దగ్గర తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరుగకుండా తల్లిదండ్రులు, పెద్దలు చర్యలు తీసుకోవాలి.

సంపులతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు

దుగ్గొండి మండలంలోని చలపర్తిలో గుండెబోయిన దిత్రిక(2) గతనెల 24న ఆడుకుంటూ వెళ్లి ఇంటిలోని నీటి సంపులో పడి మృతి చెందింది. నల్లబెల్లి మండలం రంగాపురంలో శ్రీవాత్సవ (3) నీటి సంపులో 2021 జూన్11న పడి మృతి చెందాడు. ఏడాది కిందట నర్సంపేట మండలం మహేశ్వరంలో జిల్లెల బాబు (3) నీటి సంపులోపడి మృతి చెందాడు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం వేలుబెల్లిలో అచ్యుత్(4) గత నెల 20న ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి మృతి చెందారు. తాజాగా ఈ నెల 16న వరంగల్‌లోని బాలాజీనగర్‌లో కరణం శౌర్యతేజ(4), తేజస్విని(2)లు నీటి సంపులో పడి మృతి చెందారు.



దుగ్గొండిలోని చలపర్తిలో నీటి సంపు (ఫైల్)
(ఇన్‌సెట్‌లో) సంపులో పడి మృతి చెందిన దిత్రిక (ఫైల్)

నీటి సంపుల జాగ్రత్తలు

నీటి సంపులు ఉంటే పిల్లలను వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్మాణం చేసిన నీటి సంపుల పై రేకులు, కలప చెక్కలు ఇనుప జాలి, సిమెంట్ బిల్లలు వేసి మూసి ఉంచాలి. ఇంటి పరిసరాలలో ప్రమాదకరమైన గుంతలు నీటి నిల్వలు ఉన్నట్లయితే అటు వైపు పిల్లలను వెళ్లకుండా చూడాలి. నీటి సంపుల నిర్మాణంలోనే ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. ఇనుప చువ్వలను గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలి. నీటి వసతి తీరగానే వెంటనే సంపులను వదిలి వేయకుండా మూతలు పెట్టాలి.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

జక్కుల పరమేశ్, ఎస్సై, దుగ్గొండి



చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్ర మత్తంగా ఉండాలి. పసి పిల్లలు ఆడుకుంటున్నప్పుడు వారిపై కన్నేసి ఉంచాలి. ఇంటిలో నీటి సంపులు ఉన్నట్లయితే నిర్మాణంలోనే అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలి. మూత ఉండేలా చూడాలి. నీటి వసతి తీరగానే వెంటనే మూతలు వేయాలి. పసి పల్లలను ఆడుకోవడానికి బయటకు ఏవ్వరు లేకుండా పంపరాదు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నీటి సంపులపై అవగాహన కల్పించడం జరు గుతుంది. చిన్ని అజాగ్రత్త ప్రాణానికి ముప్పు ఉంటుంది.

రాజు హత్య కేసులో ఐదుగురి అరెస్టు


అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై పరమేశ్

దుగ్గొండి, ఫిబ్రవరి 18 : మద్యానికి బానిసై భార్యను డబ్బుల కోసం వేధించిన భర్తను చంపిన భార్యతో పాటు సహకరించిన కుటుంబ సభ్యులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని మైసంపల్లికి చెందిన జెరిపోతుల రాజు మద్యం తాగి భార్య లక్ష్మిని డబ్బుల కోసం వేధించగా, శుక్రవారం అర్ధరాత్రి రాజును భార్య లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు కలసి రాళ్లతో కొట్టి, ఉరితీసి చంపిన విషయం పాఠకులకు విదితమే. రాజును హత్య చేసిన భార్య లక్ష్మి, చిన్న కుమారుడు సూర్య, కుమార్తె మాధవి, అల్లుడు రాకేశ్, మరో బంధువు తరుణ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. అరెస్టు కార్యక్రమంలో ఎస్సై పరమేశ్ పాల్గొన్నారు.

టౌన్ సీఐని కలిసిన నాయకులు


సీఐని సత్కరిస్తున్న ఎంఎస్పీ, ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేటటౌన్, ఫిబ్రవరి 18 : ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తిని ఆదివారం మహజన సోషలిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, నియో జకవర్గ ఇన్‌చార్జి తడుగుల విజయ్‌కుమార్, డీబీఆర్‌పీ జాతీ య అధ్యక్షుడు అందె రవి, డీబీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జలగం రమేశ్ సీఐ రమణమూర్తికి శాలువా కప్పి, బొకేను అందజేశారు. కార్యక్రమంలో రిపబ్లిక్‌పార్టీ ఆఫ్ తెలంగాణ బొజ్జతారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధూ పాల్గొ న్నారు. అలాగే టౌన్ సీఐ రమణమూర్తిని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, మహ్మద్ సందాని, యూసూఫ్, మ హ్మద్ ఇర్ఫాన్, మొలిసాబ్, మహ్మద్ హర్షద్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, బొకెను అంద జేశారు.

ప్రాథమిక విద్యాభ్యాసం మరువలేనిది


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, టీచర్లు

నెక్కొండ, ఫిబ్రవరి 18 : ప్రతీ విద్యార్థికి ప్రాథమిక విద్యార్థి దశ బాల్యం రోజులు మరువలేనివని, ఆ రోజులు తిరిగి రావాలని ప్రతీ ఒక్కరి మనస్సు కోరుకుంటుందని 2003-04 పదో తరగతి విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నెక్కొండలోని ప్రగతీ హై స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నాటి గురువులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. పాఠశాలలో అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. నాటి గురువులు కోడూరి అశోక్‌కుమార్, కదురు సాంబయ్య, చల్లా వెంకటరెడ్డి, విద్యాసాగర్, కోడూరి కర్ణాకర్, రాము, కోడూరి సంధ్యారాణి, అల్లీ పుష్ప, యూసిఫ్‌అలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాము, రమేశ్‌రెడ్డి, మోహన్, శృతి, కేదారి, రాజ్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన నాయకులు


ఎస్ఐని సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

రాయపర్తి, ఫిబ్రవరి 18 : రాయపర్తి మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్‌ను ఆదివారం రాయపర్తి మండల యాదవ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మర్రి వెంకటేశం, ఉపాధ్యక్షుడు నాగుల రాంబాబు, సహాయ కార్యదర్శి కుంట మధు, మాజీ అధ్యక్షుడు బండి లింగయ్య, బక్కతట్ల సాయిలు, నూనె అనిల్, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్‌లో పాల్గొన్న నేతలు


ఢిల్లీలో బీజేపీ నాయకులతో కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 18 : ఢిల్లీలోని భరత మండపంలో జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ సమావేశాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ పదాధికారులు, పార్లమెంటు సభ్యులు, వివిధ రాష్ట్రాల, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే


రాజయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 18: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన సిరిసిల్ల రాజయ్య ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆది వారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజయ్యకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.